కరెంట్ ఇవ్వండి మహాప్రభో...

- రైతులకు మళ్లీ మొదలైన కరెంట్ కష్టాలు
- ఉచిత విద్యుత్ అమలులో కూటమి విఫలం
- పగటి పూట 9 గంటలు విద్యుత్ అందించాలని కోరుతున్న రైతులు
- ఏడు సబ్ స్టేషన్‌లలో అరకొర సిబ్బంది



దుర్గి విద్యుత్ సబ్ స్టేషన్

దుర్గి: వెనుకబడిన పల్నాటి ప్రాంతంలో పూర్తిగా మెట్ట పంటలు సాగు చేస్తూ అరకొరా పొలాలు వ్యవసాయ బోర్లపై ఆధారపడి ఉన్నాయి. ఆరుగాలం శ్రమించి పంటలు సాగు చేయటానికి ప్రకృతి సహకారంతో పాటు సంబంధిత అధికారుల సహకారమూ రైతులకు అవసరం. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ముగిసి రబీ మొదలైన సమయానికి వర్షాలు కురవకపోవటం వలన పంటలు బెట్టబారుతున్నాయి. మండలంలోని చాలా గ్రామాల్లో ప్రస్తుతం మిర్చి, కంది, మొక్కజొన్న, పొగాకు పంటలు సాగుచేస్తున్నారు. నీరు పెట్టే సమయం కావటంతో రైతన్నలు పంట చేలను తడిపేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో పగటిపూట 9 గంటలు ఉచిత విద్యుత్ వ్యవసాయానికి నిరంతరాయంగా అందేది. కానీ నేడు టీడీపీ కూటమి ప్రభుత్వంలో విద్యుత్‌గా నాగార్జున సాగర్, శ్రీశైలం డ్యామ్‌లు నిండుకుండలా ఉన్నప్పటికీ కరెంట్ కోతలతో స్థానిక రైతాంగం విలవిల్లాడుతుంది. అర్ధరాత్రి సమయంలో రెండు గంటలు ఇస్తూ, పగటి పూట ఏడు గంటలు ఇస్తున్న కరెంట్ కూడా మధ్య మధ్యలో పోతూ వస్తూ ఉంది. దీంతో నీరు పారుదలకు ఆటంకం ఏర్పడటంతో తడిసిన పొలాన్నే తడుపుతూ రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సబ్ స్టేషన్‌లలో సరిపడా సిబ్బంది లేక సమస్య వెంటనే పరిష్కారం కాక సమయం వృథా అవుతుందని రైతులు వాపోతున్నారు. మండలంలో మొత్తం ఏడు సబ్ స్టేషన్‌లకు గాను దాదాపు 4 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లు ఉన్నాయి. ఇంతే మొత్తంలో ఒక్కొక్క మోటారు ఒక్కొక్క మినీ ట్రాన్స్‌ఫార్మర్ కొనసాగుతున్నాయి. పగటి వేళల్లో కరెంటు పూర్తిగా 9 గంటలు ఇవ్వాలని అధికారులను రైతులు వేడుకుంటున్నా.. పట్టించుకోని సంబంధిత విద్యుత్ అధికారులు వారికి ఇష్టమొచ్చినప్పుడు కరెంట్ ఇస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో రైతులకు కరెంట్ కష్టాలు మళ్లీ మొదలైన వచ్చాయి.

త్వరలో విద్యుత్ సమస్యలు పూర్తిగా పరిష్కరిస్తాం

ప్రస్తుతం వ్యవసాయ బోర్లు పూర్తిగా వినియోగంలోకి రావటం మూలంగా విద్యుత్ డిమాండ్ ఏర్పడింది. ఓవర్ లోడ్ మూలంగా ఫీడర్లు నిలబడటం లేదు. దీని మూలంగా విద్యుత్ వైర్లు కాలిపోతున్నాయి. 10 నుంచి 15 రోజులలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి పగటి పూట 9 గంటల విద్యుత్ నిరంతరాయంగా ఇచ్చేందుకు కృషి చేస్తాం. రైతాంగం అర్థం చేసుకొని సంబంధిత శాఖకు, సిబ్బందికి సహకరించగలరు.

– శ్రీశైలం, విద్యుత్ ఏఈ, దుర్గి

పగటి పూట 9 గంటలు విద్యుత్‌ను అందించాలి



రాత్రి సమయంలో ఇస్తున్న రెండు గంటల విద్యుత్ వలన చాలా ఇబ్బందులు పడుతున్నాం. చలికాలం కావటంతో పొలంలోకి వెళ్లి నీరు పెట్టేందుకు కూలీలు రావటం లేదు. విద్యుత్ శాఖ అధికారులు ఎల్‌సీలు ఇవ్వకుండా నిరాటంకంగా కొనసాగిస్తే రైతాంగానికి మేలు చేసిన వారవుతారు.

– రావిపల్లి నాగేశ్వరరావు, రైతు, కంచరగుంట

నిరంతరాయంగా విద్యుత్‌ను అందించండి



ప్రస్తుతం ఇస్తున్న విద్యుత్ ఎప్పుడు ఆగిపోతుందో తెలియని పరిస్థితి. దీని మూలంగా తడిసిన పొలమే మరలా తడపవలసి వస్తుంది. నాలుగు పట్లల్లో నీరు పెడుతున్న సమయంలో విద్యుత్ నిలిచిపోవటంతో మొదటి నుంచి పొలంలో మరలా ఆ పట్లకే నీరు సరఫరా చేయాల్సి వస్తుంది. రాత్రి ఇస్తున్న రెండు గంటల విద్యుత్ నిరుపయోగమవుతుంది.

– గోళ్ల కోటేశ్వరరావు, రైతు, దుర్గి

రాత్రింబవళ్లు కాపలా కాయాల్సిన దుస్థితి



గత 20 రోజులుగా పొలాలకు బెట్ట వచ్చి నీరు పెట్టవలసిన సమయంలో విద్యుత్ అంతరాయంతో సక్రమంగా నీరందు అందించలేకపోతున్నాం. ఏ వేళలో ఇస్తారో తెలియని పరిస్థితి. రాత్రి వేళలో ఇచ్చే రెండు గంటల విద్యుత్ కోసం రాత్రింబవళ్లు వేచి ఉండాల్సిన దుస్థితి నెలకొంది. అది రెండు గంటలు ఇవ్వటం వలన నీరు పెడితే అది పూర్తిగా పీల్చుకొని, ఉదయం పెట్టే నీరు మరలా అదే ప్రాంతంలో పీల్చుకోవటం వలన ఉపయోగం లేకుండా పోతుంది.

– ఉప్పల అంజయ్య, రైతు, దుర్గి

క్లుప్తంగా

నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి

మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్



పిడుగురాళ్ల: నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ అన్న క్యాంటీన్ నిర్వాహకులకు సూచించారు. పట్టణంలోని అన్న క్యాంటీన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్న క్యాంటీన్‌లో ఎంతో మంది పేదలు వస్తున్నారని, వారికి నాణ్యతతో కూడిన ఆహారం ఇవ్వాలని సూచించారు. అదే విధంగా శుభ్రతకు కూడా ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన గుర్తు చేశారు. శివారు ప్రాంతాలలోని కాలనీలకు దోమల నివారణకు ఫాగింగ్ చేయటం జరుగుతుందని ఆయన తెలియజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మిరపలో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మాచవరం: మిరప పంటలో అక్కడక్కడ బొబ్బర తెగులు ఆశిస్తుందని నివారణకు యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ వి.శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. మండలంలోని తురకపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ పంటల సాగులో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు. రబీలో వరి పంట సాగు చేసే రైతులు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన ద్వారా లబ్ధి పొందేందుకు డిసెంబర్ 31లోగా ఎకరాకు రూ.630 ప్రీమియం నగదు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ కె.రామమ్మ, వ్యవసాయ సహాయకులు అన్వర్‌బాషా, గ్రామ పెద్దలు, రైతులు పాల్గొన్నారు.

ప్రజలకు సత్వర సేవలు అందించాలి

ఎంపీడీవో గొసియాబేగం



గురజాల: గ్రామ ప్రజలకు సత్వర సేవలు అందించాలని పెండింగ్‌లో ఏ పనులు ఉండకుండా ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని ఎంపీడీవో షేక్ గొసియాబేగం సూచించారు. మండల పరిధిలోని మాడుగుల గ్రామ సచివాలయంలో మంగళవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేపట్టారు. సచివాలయంలోని రికార్డులను పరిశీలించారు. సిబ్బందికి గ్రామ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

కార్తిక వన సమారాధనలో సత్యనారాయణ వ్రతం



దాచేపల్లి: స్థానిక వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో ఆర్యవైశ్య కార్తిక వన సమారాధన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్తిక మాసం సందర్భంగా ఆలయానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. సత్యనారాయణ వ్రతంలో పలువురు దంపతులు పాల్గొన్నారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరణ చేశారు. ఆర్యవైశ్యులు కార్తిక వన సమారాధనలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కార్తిక మాస ఏకాదశి ఎంతో పవిత్రమైనది



మాచర్ల: కార్తిక మాసంలో వచ్చే ఏకాదశి ఎంతో పవిత్రమైనది, ఆ రోజున గురువులను, భగవంతునిని పూజించటం ఎంతో పవిత్రమైన కార్యక్రమమని గీతా ప్రచార మండలి జ్ఞానాశ్రమ పీఠాధిపతులు, శ్రీశైలార్య దేశిక స్వామి, గురుజి పండరి శ్రీశైలం అన్నారు. మంగళవారం గుంటూరు రోడ్డులోని రామకృష్ణ పరమహంస ధ్యాన మందిరంలో గురుజీకి జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గురుజీ పండరి శ్రీశైలం మాట్లాడుతూ ఆనదిన ఆత్మదర్శన వితరణోత్సవంగా భగవద్గీతా తత్వ బ్రహ్మ జ్ఞాన యజ్ఞం జరిగిందన్నారు. దీని వలన సంపూర్ణ శరణాగతి, దృఢ విశ్వాసము, ప్రశాంత స్థితి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ముప్పవరపు గాంధీ, సీతమ్మ, సూరె నాగలక్ష్మి, తిరివీధి శిరీష, శైలజ, నాగార్జున, వేముల శ్రీనివాసరావు, తిరివీధి వెంకట నాగేశ్వరరావు, వేముల అనసూర్యమ్మ, గీత, విడెల కృష్ణ పాల్గొన్నారు.

చౌక డిపోలకు నోటిఫికేషన్



మాచర్ల రూరల్: మండల, పట్టణంలో నూతన చౌక డిపోలకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు తహసీల్దార్ బత్తుల వాణి ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 1,2, 11, 22, 24 చౌక డిపోలు, రూరల్‌లోని కొత్తపల్లి, కంభంపాడు, కొప్పునూరు, కొత్తూరు, విజయపురిసౌత్ గ్రామాలలోని చౌకడిపోలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఆమె చెప్పారు. దరఖాస్తుదారులు వచ్చే నెల 4వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వాసవి క్లబ్ సేవలు విస్తృతం చేయండి



మాచర్ల: ప్రపంచ వ్యాప్తంగా 26 దేశాలలో పేద, మధ్యతరగతి వారికి వాసవి క్లబ్ ఎంతో దోహదాలుగా సేవలు నిర్వహిస్తుందని గవర్నర్ మునగాల చిరంజీవి అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐటీసీ కార్యాలయంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ సభ్యులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులు ప్రతి ఒక్కరు వాసవి క్లబ్‌లో చేరి పేద, మధ్య తరగతి వారికి సాయమందించాలన్నారు. వాసవి క్లబ్ కుల, మత రహితంగా సేవలందిస్తూ ముందుకెళ్తుందన్నారు. ప్రతి ఏటా ప్రపంచవ్యాప్తంగా సుమారు రూ.70 కోట్లు ఖర్చు చేసి పలు సేవా కార్యక్రమాలు చేస్తుందన్నారు. నూతన క్లబ్‌ల ఏర్పాటు డిసెంబర్ నెలాఖరులోపు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ అధ్యక్షులు ఓరుగంటి చెన్నకేశవరావు, వ్యవస్థాపక అధ్యక్షులు తిరివీధి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్, ట్రెజరర్ శేషారావు, జిల్లా నాయకులు నాగేశ్వరరావు, ఆర్యవైశ్య పెద్దలు ఉన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక శిల్పారామం

వైస్‌చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన మంజులారెడ్డి



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే శిల్పారామం కేంద్రాలను మరింత అభివృద్ధి చేసే విధంగా తీర్చిదిద్దుతానని శిల్పారామం సొసైటీ చైర్‌పర్సన్‌గా నియమితులైన మాచర్ల పట్టణానికి చెందిన మంజులారెడ్డి పేర్కొన్నారు. విజయవాడలోని శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్, కల్చరల్ సొసైటీ కార్యాలయంలో ఆమె మంగళవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా శిల్పారామం సీఈఓ స్వామినాయుడు, మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి తదితరులు ఆమెను అభినందించారు. అనంతరం మంజులారెడ్డి మాట్లాడుతూ శిల్ప కళలు, సంప్రదాయ చేతి వృత్తిదారుల హస్తకళల పరిరక్షణకు ఏర్పాటు చేసిన శిల్పారామం సొసైటీ కీర్తి ప్రతిష్టలను మరింత ఇనుమడింపజేసేలా కృషి చేస్తానని చెప్పారు. శిల్పారామం సంస్కృతి, సంప్రదాయాలకు కేంద్ర బిందువుగా నిలుస్తుందన్నారు. ఇక్కడి వస్తువుల్లో ఎక్కువ భాగం గ్రామీణులు రూపొందించిన కళాకృతులేనని తెలిపారు. అదే విధంగా వివిధ సంస్కృతులకు సంబంధించిన సాంస్కృతిక ప్రదర్శనలు కూడా ఉంటాయని అన్నారు.

ఆటో బోల్తా

దాచేపల్లి: స్థానిక నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో మంగళవారం అదుపుతప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌కి స్వల్ప గాయాలు కాగా ఆటోలో తరలిస్తున్న ఒక గోవు తీవ్రంగా గాయపడింది. వివరాలు ఇలా ఉన్నాయి. మిర్యాలగూడెం నుంచి నాలుగు గోవులతో ఆటో దాచేపల్లి వైపుకి వస్తుంది. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని దాటే క్రమంలో అతివేగంతో ఉన్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఒక గోవు తీవ్రంగా గాయపడింది. ఆటో డ్రైవర్‌కి స్వల్ప గాయాలు కావటంతో హాస్పిటల్‌కి తరలించారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

వరి రైతుల్లో గుబులు


కోతకు వచ్చిన వరి చేను

కారెంపూడి: వరి రైతుల గుండెల్లో తుపాను గుబులు రేపుతోంది. మంగళవారం ఎండ పోయి ఆకాశమంతా మేఘావృతమై చలిగాలులు వీస్తుండడంతో రైతుల్లో వరద వచ్చే పంట పాడైపోతుందని ఆందోళన నెలకొంది. గతంలో కురిసిన వర్షాలకు ఒక సారి నేల వాలిన వరి పైకి లేచి గింజలు గట్టిపడ్డాయి. ఈ సారి వర్షం పడితే వాటితో పాటు కోతకు వచ్చిన వరి చేలు కూడా నేలవాలుతాయని భయాందోళన చెందుతున్నారు. దాదాపు వరి పంటల్లోన్ని కోతకు దశకు వచ్చాయి. వెన్ను బరువై ఉన్న పంటలపై చిన్న వర్షం పడినా పంటలు నేలవాలడం ఖాయం. దానికి కొద్దిగా గాలులు తోడైతే మరింత నష్టం. ఈ సీజన్‌లో హార్వెస్టర్లు దొరికిన రైతులు పంటలను కోయించి ధాన్యం ఇళ్లకు చేర్చుకుంటున్నారు. సాగర్ కాల్వలకు నీటి రాకతో ఖరీఫ్‌లో పల్నాడు జిల్లాలోనే 2.4 లక్షల ఎకరాలలో వరి సాగులో ఉంది. సూర్పెట్ల ప్రారంభమయ్యాయి. ఒక వేళ వర్షం పడితే నీరు నిల్వ ఉండకుండా గండ్లు పెడుతున్నారు. ఇప్పటికే పంటల్లో ఉన్న నీటిని బయటకు పంపుతూ నీరు పెట్టడం కూడా పూర్తిగా ఆపేశారు.

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం


ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో మాట్లాడుతున్న ఎంపీడీఓ సరోజినిదేవి


రెంటచింతలలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు

రెంటచింతల: భారత రాజ్యాంగం ప్రపంచంలోనే అత్యున్నత విలువలు కలిగిన విశిష్టమైనదని ఎంపీడీఓ కె.సరోజినిదేవి అన్నారు. మంగళవారం భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా స్థానిక ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అధ్యక్షతన ఏడుగురు సభ్యులతో రాజ్యాంగ రచన సంఘం 2 సంవత్సరాల 11 నెలల 17 రోజులలో రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగిందన్నారు. రాజ్యాంగాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. విద్యార్థులతో గ్రామ పురవీధులలో ర్యాలీ నిర్వహించి ప్రధాన రహదారిపై ప్రతిజ్ఞ చేయించారు. ముందుగా ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించి సచివాలయ, కార్యాలయ సిబ్బంది, ఉపాధి హామీ పథకం పీల్డ్ అసిస్టెంట్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వై.శివనాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎస్.మోహన్, ఏపీఎం జయచంద్రకుమార్, కస్తూరిబా హనుమంత పోతుకోర్జిల్ అధ్యక్షులు నారాయణపురం శ్రీనివాస్, వైఎస్‌ఆర్‌సీపీ స్కూల్ కరస్పాండెంట్ యేమారి వెంకట సైదయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయపురిసౌత్: విజయపురిసౌత్‌లో జాతీయ రాజ్యాంగ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర ఐక్య వేదిక ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు రాంప్రసాద్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను రాజ్యాంగ దినోత్సవం రోజు గుర్తు చేసుకోవటం అందరి బాధ్యత అన్నారు. రాజ్యాంగంలో పొందు హక్కులు, బాధ్యతలు ఉంటాయని ఇదే మన రాజ్యాంగ విశిష్టత అని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన బాధ్యతలను ప్రతి ఒక్కరూ నెరవేర్చాలని కోరారు. దీనికి ముందు గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాల మహానాడు అధ్యక్షుడు బొప్పిడి చంద్రశేఖర్ రావు, గుంటి ఆంధ్రూస్ బాబు, ఏఈ నరసింహమూర్తి, తోకల అమృతరావు, జ్యోతి నారాయణ, మాల మహానాడు ఐక్య వేదిక అధ్యక్షుడు బుట్టి అక్కయ్య, గుర్రం సాగర్‌బాబు, ధనుంజయరావు, గొర్రెముచ్చు ఆంజనేయులు, వర్కింగ్ అధ్యక్షుడు పెంచల నాగేంద్రబాబు, పద్మారావు, పిల్లి రాజు పాల్గొన్నారు.


సోషల్ ప్రాజెక్టు ప్రదర్శనను ప్రారంభిస్తున్న అధికారులు

అంబేడ్కర్ సేవలు మరువలేనివి

మాచర్ల రూరల్: ప్రపంచ దేశాలు సైతం భారత రాజ్యాంగం వైపు ఆసక్తి కనబరిచేలా దేశ ప్రజలందరూ గర్వంగా తలెత్తుకుని తిరిగేలా రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేడ్కర్ సేవలను మరువలేమని ఎంఈఓ అల్లి సురేష్ తెలిపారు. మండలంలోని వీరభద్రాపురం పాఠశాలలో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి మాట్లాడారు. దేశంలోని అన్ని వర్గాల ప్రజలు విభేదాలు లేకుండా సమతుల్యతతో అభివృద్ధి చెందుతున్నారంటే రాజ్యాంగం గొప్పతనమని అన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గాడె కిరీటిరెడ్డి, ఉపాధ్యాయులు నాగమణి, నిర్మల, శేషవల్లి, ఉష, కొండలు, కొర్లయ్య, ఆదిలక్ష్మి, ఏడుకొండలు, నాగరాజు ఉన్నారు.

మాచవరం: మండలంలోని పలు గ్రామ సచివాలయాల్లో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ చిత్రపటాలకు, జాతీయ నాయకుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. భారత రాజ్యాంగం ప్రజాస్వామ్య దేశాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దుర్గి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం, సాంఘిక శాస్త్ర దినోత్సవ వేడుకలను హెచ్‌ఎం కోటేశ్వరమ్మ అధ్య...


మాట్లాడుతున్న రాష్ట్ర ఐక్య వేదిక ఉద్యోగ సంఘాల అధ్యక్షుడు రాంప్రసాద్


నేమవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు


ఎంపీపీ స్కూల్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఎంఈఓ అల్లి సురేష్, హెచ్‌ఎం

క్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులచే రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించారు. సాంఘిక ప్రాజెక్టు ప్రదర్శనను ఎంఈఓ-2 డి బెంజిమెన్ ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు క్విజ్ పోటీ నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బహుమతులు అందజేత

విజయపురిసౌత్: జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో నిర్వహించిన పలు పోటీల్లో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఏపీఆర్‌జేసీ ప్రిన్సిపాల్ సరోజిని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి ఎం.రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోడి పందేల స్థావరంపై దాడి

మాచర్ల రూరల్: కోడి పందేల నిర్వహిస్తున్న ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద రూ.40,020 నగదును, కోడి పుంజులను స్వాధీన పరచుకున్న ఘటన మండలంలోని గన్నవరం గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. రూరల్ ఎస్‌ఐ నారాయణ కథనం ప్రకారం గన్నవరం గ్రామ శివారులో ఐదుగురు వ్యక్తులు కోడి పందేలు వేస్తూ డబ్బులు కాస్తున్న సమాచారాన్ని తెలుసుకొని సిబ్బందితో దాడులు నిర్వహించినట్లు ఆయన చెప్పారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ మట్కా, జూదం, నాటుసారా వంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

30 సీసీ కెమెరాలతో నిఘా

క్రోసూరు: మండలంలో పోలీసు స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ కె.నాగేంద్రరావు మంగళవారం తెలిపారు. మండల కేంద్రం, గారపాటి పాలెం, నాగవరం, దొడ్లేరుతో పాటు పలు గ్రామాల్లో ఇప్పటికే 30 కెమెరాలు అమర్చినట్లు చెప్పారు. నేరాల నియంత్రణ, శాంతి భద్రతల పరిరక్షణకు నిఘా నేత్రాలు ఉపయోగపడతాయని ఎస్‌ఐ పేర్కొన్నారు.

సీసీఐ కేంద్రాలలో పత్తిని విక్రయించండి


మాట్లాడుతున్న ఏఓ లక్ష్మారెడ్డి

మాచర్ల రూరల్: పత్తి పంటను ప్రభుత్వం క్వింటారూ.7,521కు కొనుగోలు చేస్తుందని, సంబంధిత రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని ఏఓ కట్టా లక్ష్మారెడ్డి కోరారు. పత్తి రైతులు ఆధార్ కార్డు, పాసు పుస్తకంతో సేవా కేంద్రాల్లో నమోదు చేసుకొని పత్తిని విక్రయించాలని సూచించారు. ఉద్యానవన శాఖాధికారి సురేష్ బాబు మాట్లాడుతూ మిరప పంటలో యాజమాన్య పద్ధతులు పాటించి రసం పీల్చే పురుగు ఉధృతిని తగ్గించుకోవాలని కోరారు. 10 నుంచి 15 పసుపు పళ్ళెం జిగురు అట్టలు పెట్టుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన డివిజనల్ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ రబీలో నోటిఫైడ్ పంటలకు ప్రీమియం చెల్లించి బీమా పరిధిలోకి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్యులు ప్రసాద్, ఎంపీఈఓలు వర్మ, శ్రావణి, రైతులు పాల్గొన్నారు.

పునీత అంతోని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి


సమష్టి దివ్య పూజాబలిని సమర్పిస్తున్న ఫాదర్ జోజప్ప

రెంటచింతల: క్రీస్తు సువార్తను ప్రచారం చేస్తూ ఆయన అడుగుజాడలలో నడిచిన పునీత అంతోని జీవితాన్ని క్రైస్తవులందరూ ఆదర్శంగా తీసుకోవాలని పిడుగురాళ్ల కాథలిక విచారణ గురువులు రెవ.ఫాదర్ పెదకొట్ల జోజప్ప కోరారు. స్థానిక అంతోని చర్చిలో నిర్వహిస్తున్న 9 మంగళవారోత్సవాలు పురస్కరించుకుని కాసుకుమాత చర్చి విచారణ గురువులు రె.ఫాదర్ ఏరువ లూర్దు మర్రెడ్డి అధ్యక్షతలో ఆయన 6వ మంగళవారం సమిష్టి దివ్యపూజాబలిని సమర్పించారు. ఈ సందర్భంగా రెవ.ఫాదర్ జోజప్ప భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ పునీత అంతోని క్రీస్తు సువార్తను ప్రచారం చేయడం వలన పునీతులయ్యారన్నారు. క్రీస్తు ఆరాధికులు పునీత అంతోని అడుగు జాడలలో నడవాలన్నారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ పూజాబలిలో కానుక మాత చర్చి సహాయక గురువులు ఆగస్టీన్, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

క్రీస్తును ఆహ్వానిస్తూ ప్రార్థనలు



క్రోసూరు: మండల కేంద్రంలోని ఏఈఎల్‌సీ చర్చి సంఘ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి వరకు క్రిస్మస్ కాలాన్ని ఆహ్వానిస్తూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చి పాస్టర్ రెవ డాక్టర్ ఎం.సుందరరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. పాస్టర్ మాట్లాడుతూ ఏసు ప్రభువు లోక రక్షకుడిగా జన్మించారని, ఆయన జననం లోకానికి గొప్ప వెలుగును ప్రసాదించిందన్నారు. విశ్వాసులందరూ కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు. గ్రామ ప్రధాన సెంటర్‌లో నక్షత్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జెకొకేస్ సంఘ పెద్దలు, విశ్వాసులు పాల్గొన్నారు. సండే స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన ప్రత్యేక నృత్యాలు అలరించాయి. అనంతరం క్రిస్మస్ కేక్ కట్ చేసి అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.